ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి



విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందనిఈ భారాల పెరుగుదలను నిరసిస్తూ విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం ధర్మవరం కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పేరుతో 15 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. వచ్చే మార్చి నుండి మరో 14 వేల కోట్ల రూపాయల భారం వేయడానికి సిద్ధమవుతోందని విమర్శించారు. విద్యుత్ భారాలకు గత ప్రభుత్వం కారణమైతే ఎందుకు సెకి ఒప్పందం రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు కుదించి, మరోవైపు భారాలు వేయడంపై ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. అదానీ కంపెనీ లాభాల కోసం ప్రజలను బలిపెట్టే విధానాలు ఉపసంహరించు కోవాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని ,నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికల హామీ ఇచ్చి ,అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచుతోందన్నారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండని నారా లోకేష్ ప్రజలకు పిలుపు ఇచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్మార్ట్ మీటర్లను అమలు చేస్తున్నారని విమర్శించారు. కరెంటు చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా సిపిఎం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ఎస్‌హెచ్. బాషా, మారుతీ, జెవి. రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్





'బెల్టు' తీయడం సాధ్యమేనా..?

'బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించం, బెల్ట్ షాపులు నిర్వహిస్తే షాపులకు మొదటి సారి రూ.5 లక్షలు జరిమానా, రెండవ సారి అయితే షాపు లైసెన్స్ రద్దు చేస్తాం' ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్తున్న మాట. కానీ కింది స్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. అయితే 'బెల్టు షాపులు నిర్వహించినట్లైతే కలెక్టర్, ఎస్పీ లదే బాధ్యత' అంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇందులో భాగంగానే శనివారం రోజు ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామాల్లోని అనుమానితుల ఇళ్లు, గడ్డి వాముల్లో, కళ్లాల్లో సైతం సోదాలు నిర్వహించారు. కానీ ఎన్ని బెల్టు షాపులను మూయించారో పోలీసులే చెప్పాల్సిఉంది.

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఒక్కో గ్రామంలో 4 నుంచి 6 షాపులు
అంతటా అధికార పార్టీ కార్యకర్తలే
అధికారిక షాపులనే కట్టడి చేయలేని వైనం

బహిరంగంగానే 'బెల్టు' షాపులు:

జిల్లా వ్యాప్తంగా 136 లిక్కర్ షాపులు ఉన్నాయి. అందులో 41 నగర పరిధిలో ఉన్నాయి. వీటిలో అత్యధిక షాపులు అధికార పార్టీ నాయకులవే అన్న చర్చ కూడా జరుగుతోంది. నగర పరిధిలోను, జిల్లా వ్యాప్తంగా ఆయా షాపుల పరిధిలో గ్రామగ్రామాన బహిరంగంగానే 'బెల్టు' షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిలో కూడా అత్యధిక శాతం అధికార పార్టీ కార్యకర్తలే అన్నది కూడా బహిరంగ రహస్యమే. ప్రభుత్వం మారిన వెంటనే పోలీసు శాఖను ప్రక్షాళన చేస్తామని ప్రకటించి ఉన్నతాధికారి నుంచి కిందిస్థాయి వరకు తమకు అనుకూలంగా ఉన్న వారినే నియమించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని పోలీసులు బెల్టు షాపులను నియంత్రించడం సాధ్యమేనా అన్న చర్చ ప్రజల్లో జోరుగా సాగుతోంది. ఇందుకు ఉదాహరణ పోలీసులు నిర్వహించిన కార్టన్ సెర్చ్ లో గ్రామాల్లో బహిరంగంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులు కనపడకపోవడమేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నగరంలోని షాపులనే కట్టడి చేయలేని వైనం

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి తిరిగి పాత పాలసీనే అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా టెండర్లను పిలిచి మద్యం షాపులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించింది. ఇందులో భాగంగా నగరంలో 41 మద్యం షాపులు ఉన్నాయి. నిజానికి వీటికి గతంలో మాదిరిగా అధికారిక పర్మిట్ రూములు లేవు. షాపులో మద్యం తీసుకుని షోడా బళ్లు, కూల్ డ్రింక్ షాపులు, లేదంటే ఊరిబయట తాగాలి. అయితే ప్రభుత్వం తమకు ఇస్తున్న కమీషన్ చాలడం లేదని వెంటనే పెంచకపోతే మద్యం అమ్మకాలను నిలిపివేస్తామని షాపుల యజమానులు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. దీనికి తోడు ప్రభుత్వ అనుమతి లేకుండానే ఒక్కో మద్యం షాపు వద్ద 2 నుంచి 3 సెంట్ల స్థలం ఉండేలా చూసి అనధికారిక పర్మిట్ రూములను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు పోలీసులు కూడా ఇతోధికంగా సహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. కారణం షోడా బళ్లు, కూల్ డ్రింక్ షాపులపై దాడులతో పాటు ఎక్కడో అడవిలో చెట్లకింద మద్యం సేవిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు నగరం నడిబొడ్డున ఉన్న లిక్కర్ షాపుల వద్ద ఉన్న అనధికారిక పర్మిట్ రూములు ఎందుకు కనపడటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తప్పనిసరిగా షాపుల వద్ద ఉన్న అనధికారిక పర్మిట్ రూముల్లోనే తాగించేందుకే షోడా బళ్లు, కూల్ డ్రింక్ షాపులు, ఊరిబయట డ్రోన్లతో మందు తాగకుండా కట్టడి చేశారన్న విమర్శలూ ఉన్నాయి. అయితే బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ప్రకటన చేయడం ప్రజల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని బెల్టు షాపులను నియంత్రించడం సాధ్యమేనా అని ప్రజల్లో చర్చకు జరుగుతోంది. ఏదిఏమైనా ఇప్పటికైనా జిల్లా ఎస్పీ చొరవతో గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను తొలగించి తమ కుటుంబాలు బాగుపడేలా చూడాలని గ్రామీణ మహిళలు వేడుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప విమర్శించారు. ఆదివారం పుట్టపుర్తిలో సిపిఎం కార్మిక కర్షక భవనంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అజెండాతో కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. ఈ సంఘం పోరాటంతోనే ఈ రాష్ట్రంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ 28 అంశాలు చేర్చారని అన్నారు. వాటిలో డప్పు కళాకారుల పెన్షన్ల కోసం చేసిన పోరాటం ఒకటని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కోసం పోరాడి సాధించిందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ లో ఎలాంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కావలసిన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు దళిత కాలనీలో సమస్యలు గుర్తించి ఆ సమస్యలపై పోరాటాలు చేస్తాయన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ తెలియకుండానే మాట్లాడడం సమంజసం కాదన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి. రమణ, రామాంజనేయులు రామాంజప్ప, గోపాల్, మల్లయ్య, జ్యోతి, సరస్వతి, గంగమ్మ, చంద్రమ్మ, సరస్వతి, అనితమ్మ, రత్నమ్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

రౌడీ షీటర్లు, పాత కేసుల్లో ఉన్న నిందితులు ఎలాంటి సమస్యలు సృష్టించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ వి.రత్న హెచ్చరించారు. ఆదివారం హిందూపురం సబ్ డివిజన్ పరిధిలోని షీటర్లు, పాత కేసులో ఉన్న నిందితులకు జిల్లా ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పాత నేరస్తుల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని తెలిపారు. ఎలాంటి గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా, ప్రేరేపించేందుకు కారణమైనా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో భాగంగా హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట చెక్ పోస్ట్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. మద్యం, ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా హిందూపురంలోనే వన్ టౌన్, టూ టౌన్, రూరల్ ,అప్ గ్రేడ్ సర్కిల్ పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేసి అధికారుల పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్ధన, అబ్దుల్ కరీం, ఎస్‌బిఎస్ఐ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సేవాసంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని వాల్మీకి భవన్ లో ఆదివారం వాల్మీకి సంఘం నాయకులు సమావేశం నిర్వహించి, వాల్మీకి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెంకటరాముడు, కార్యదర్శిగా నరసింహమూర్తి, ట్రెజరర్ గా సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లోకేష్, న్యాయ సలహాదారులుగా శివశంకర్, ఉపాధ్యక్షులుగా రాజు, శ్రీనివాసులు, డి ఆర్ జి శ్రీనివాసులు, సంజీవప్ప, ఆటో నరసింహమూర్తి, మేస్త్రి లింగప్ప, జాయింట్ సెక్రటరీగా అశ్వర్థ నారాయణ, శేఖర్, అంజి, లింగేష్, రంగప్పను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

ప్రయివేటు దందా..!

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నడపని ఆర్టీసీ
ప్రయివేటు బస్సుల్లో అధిక ఛార్జీల వసూలు
పండుగ పూట ప్రయాణికుల జేబులకు చిల్లు



నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులతో తిరుగుతున్న ప్రయివేటు బస్సు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పండుగ పూట ప్రయివేటు బస్సుల యాజమాన్యాలు దందాకు తెరలేపాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన రైట్ రైట్ అంటూ కదిరి మీదుగా అడ్డగోలుగా బస్సుల రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రివేళల్లో సుదూర ప్రాంతాల కోసం కాంట్రాక్ట్ క్యారేజ్ అనుమతి పొంది నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తీసుకువెళుతూ అది కూడా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రొద్దుటూరు విజయవాడ మధ్య నంద్యాల బెంగళూర్, ప్రొద్దుటూరు బెంగళూర్ మధ్య హైదరబాద్ వంటి నగరాలకు రాక పోకలు సాగించే విధంగా అనుమతులు తీసుకొని సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని ఆసరా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడుపుతున్నారు. ప్రభుత్వానికి ఆర్టీసీకి నష్టం కలిగించే విధంగా బస్సులను తిప్పుతున్నారు. ప్రయాణికులు అవసరాన్ని ఆసరాగా చేసుకుని అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులు జేబులుకు చిల్లు పెడుతున్నారు. ఆర్టీసీ అధికారులు పండుగ పూట ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టు సుదూర ప్రాంతాలకు బస్సులు నడపలేదన్న విమర్శలు వినపడుతున్నాయి. వీరు పరోక్షంగా ప్రయివేటుకు ఆదాయం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తప్పని పరిస్థితుల్లో ప్రయివేటు బస్సుల్లో అధికఛార్జీలు ఇచ్చి వెళ్ళాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ పూట ప్రయాణికుల అసరాను పసిగట్టి కదిరి నుండి బెంగళూర్ మధ్య నడిచే బస్సులు యాజమాన్యాలు మరికొన్ని బస్సులను అనుమితి లేకుండా నడుపుతున్నట్లు సమాచారం. సాధారణంగా బస్సు ఛార్జీ 240 రూపాయలు అయితే 300 రూపాయలకు పైగానే వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్, సిఐటియు పట్టణ కన్వీనర్ రాము డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమ్మె కాలం నాటి ఒప్పందాలకు సంబంధించిన జిఒలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన రీలే దీక్షలు ఆదివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని, నడిరోడ్డుపైఅర్ధ నగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ దీక్షలకు సిఐటియు పట్టణ కన్వీనర్ రాము మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సమస్యలను పరిష్కరించకుంటే మరో సమ్మె, చలో విజయవాడ నిర్వహించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షులు రామచంద్ర, రామాంజప్ప, జాయింట్ సెక్రెటరీ చంద్ర, కమిటీ సభ్యులు కవితమ్మ, గంగ రత్న, ఓబులమ్మ, సుబ్బలమ్మతో పాటు అధికసంఖ్యలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

పండ్లతోటల సాగుతో రైతులకు లాభాలు

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పండ్ల తోటల వల్ల రైతు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు పంటలు పెట్టి నష్టపోతున్నారు. వేరుశనగ పంట జిల్లాలో ప్రధాన పంటగా పెట్టే రైతులు ప్రతిసారి నష్టపోతూనే ఉన్నారు. వ్యవసాయం జూదంలా మారిపోయింది. పంట చేతికి వచ్చేవరకు నమ్మకం ఉండదు. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో రైతులు నిరాశకు గురవుతూ అప్పుల ఊబిలో బయటపడలేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు పెరిగిపోయి తీర్చే మార్గం లేక కొందరు ఆత్మహత్యకు సైతం పాల్పడుతున్నారు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో నూతన వంగడాలతో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతోంది. ముఖ్యంగా తక్కువ నీటి తడులతో అధిక లాభాలు పండ్ల తోటల పెంపకం వల్ల పొందవచ్చని భావించి ప్రభుత్వం అందుకు అనుకూలంగా డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీతో అందిస్తూ ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా నేల స్వభావం బట్టి జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది. సత్య సాయి జిల్లాలో ఎర్ర నేలలు పండ్ల తోటల పెంపకానికి అనుకూలం. ఈ నేపథ్యంలో పండ్ల తోటల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.



ప్రశ్న: జిల్లాలో ఏయే పండ్ల మొక్కల పెంపకం చేపట్టవచ్చు.? ప్రస్తుత విస్తీర్ణం ఎంత.?

జవాబు: జిల్లాలో ఎక్కువ భాగం ఎర్ర నేలలు ఉండడంతో పండ్ల తోటల పెంపకానికి అనుకూలంగా ఉంది. మామిడి, చీనీ, దానిమ్మ, సపోటా, అరటి, బొప్పాయి, ద్రాక్ష, జామ, అంజూరా పండ్ల మొక్కలు పెంచుకోవచ్చు. మొత్తం1699. 22 హెక్టార్లలో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యం కాగా 1579.50 హెక్టార్లలో పెంపకం జరుగుతోంది. 1524 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర: నీటి వనరులు కల్పించడానికి చేపడుతున్న చర్యలు ఏమిటి.?

జ : ప్రభుత్వం అనేక పథకాల ద్వారా నీటి వనరులు సమకూరుస్తోంది. అందులో డ్రిప్ ఇరిగేషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తమ శాఖ ద్వారా చిన్నపాటి కుంటలు, ఫారం ఫండ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఫారం ఫండ్స్ లక్ష్యం 33 చోట్ల కాగా రూ. 82.5 లక్షలతో ఆ 33 చోట్ల ఫారంఫండ్స్ నిర్మించడం జరిగింది. 33 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర: మీ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు ఏమిటి.?

జ: జిల్లాలో నూతన పండ్ల తోటల విస్తరణ, రెండు మూడు సంవత్సరాల అనంతరం రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుంది. నీటి వనరుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. కోత అనంతరం తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు వివరిస్తాం. ఇందులో భాగంగానే రైతులకు తగిన శిక్షణలు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వం నుంచి అందే డ్రిప్, స్ప్రింక్లర్ల గురించి వివరిస్తున్నాం. సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు సబ్సిడీ ద్వారా అందిస్తాం.

ప్ర: జిల్లాలో ఎంతమంది రైతులకు లబ్ధి చేకూరింది.?

జ: పండ్ల తోటల పెంపకం, ఇతర సదుపాయాల ద్వారా 5100 మంది లబ్ధి పొందారు. ఆర్థికంగా రూ. 564.53 లక్షల వరకు వివిధ రకాలుగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. అలాగే హైబ్రిడ్ కూరగాయల పంటల ద్వారా కూడా రైతులు లబ్ధి పొందుతున్నారు.

ప్ర: రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ: ఒకే రకమైన పంటల ద్వారా కాకుండా, పండ్ల మొక్కల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను రైతులు అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలి. రెండు మూడు రోజులకు ఒకసారి మరికొన్ని వారానికి ఒకసారి నీటి తడులు అందించే మొక్కలను నీటి లభ్యత బట్టి పెంచుకోవాలి. డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తోంది. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మొక్కలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి. నూతన యాజమాన్య పద్ధతులు అవలంభిస్తూ అభివృద్ధి చెందాలి.



జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులతో మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. పట్టణంలోని సిఎన్‌బి ఫంక్షన్ హాలులో గత గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం మంత్రి వారికి పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. అంతకుముందు మంత్రి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ యువత వివేకానందుడి స్ఫూర్తితో ఓ లక్ష్యాన్ని ఎంచుకుని దానిని చేరుకునేందుకు శ్రమించాలన్నారు. నియోజకవర్గంలోని యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ మాట్లాడుతూ జాబ్ మేళాలో ఎంపికైన వారందరూ ఉద్యోగాల్లో చేరేలా చూస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించి జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. జాబ్ మేళాలో ఎంపికవ్వని వారికి వారి విద్యార్హతను బట్టి నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ, జింకా చంద్రశేఖర పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి సత్యకుమార్ పట్టణంలోని ఎన్‌డిఎ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని, ఆపత్కాలంలో వారికి మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, నాయకులు డోలా రాజారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్యామరావు పాల్గొన్నారు.

వివేకానందకు మంత్రి నివాళి

ధర్మవరం టౌన్ : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక రేగాటిపల్లి రోడ్డులో ఉన్న శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో మంత్రి సత్యకుమార్ స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ప్రపంచానికి భారత ఆహార్యాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. యువత ఆ మహనీయుడి స్ఫూర్తితో దేశ స్థాయిలో రాణించాలనే ఉద్దేశంతో లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ వారితో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కరణం హర్షవర్ధన్, బిజెపి నాయకులు హరీశ్‌బాబు, సందిరెడ్డి శ్రీనివాసులు, జింకా చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినతి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరుతూ ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మంత్రి చేత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులుయాదవ్ ఉద్యోగుల సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ, మల్లికార్జున, ధర్మవరం, కదిరి, మడకశిర తాలూకాల అధ్యక్షులు సాయిప్రకాష్, ఫక్రుద్దీన్, నటరాజ్‌యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి హరిప్రసాద్, ధర్మవరం కార్యదర్శి ఓబులేషు, గ్రామపంచాయతీ విభాగం సభ్యులు సుధాకర్, సుబ్రహ్మణ్యం, విఆర్‌ఎ అధ్యక్షులు సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

'గోకులం' ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



గోరంట్ల మండలం మేరెడ్డిపల్లిలో బీటీ రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సవితమ్మ

ప్రజాశక్తి-గోరంట్ల

రైతుల ఆదాయం రెట్టింపు అవ్వాలన్నదే 'గోకులం' పథకం ఉద్దేశం అని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. మండలంలోని తిప్పరాజుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్డును ఆదివారం మంత్రి సవిత ప్రారంభించి మాట్లాడారు. 'పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలు'లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకూ గోకులం షెడ్లను ప్రారంభిస్తున్నా మన్నారు. గత వైసిపి ప్రభుత్వం స్కాముల్లో రికార్డులు సృష్టిస్తే కూటమి ప్రభుత్వం పల్లె పండుగ, గోకులాలు, పింఛన్ల పెంపు, సకాలంలో జీతాలివ్వడం, అభివృద్ధి పనులతో రికార్డు సాధిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 13,326 గ్రామసభలు నిర్వహించామని, రూ. 4,500 కోట్ల వ్యయంతో పనులకు అనుమతి తీసుకుని, 23,588 గోకులాలు, 3,500 కి.మీ సీసీ రోడ్లు మంజూరు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,302 గోకులం షెడ్లకు గానూ రూ. 29.29 కోట్లు, పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 209 గోకులం షెడ్లకు గానూ రూ. 4.68 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుగుందన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందిస్తుందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం పథకాలు అమలవుతాయన్నారు. వైసిపి హయాంలో సర్పంచులకు నిధులు ఇవ్వక గ్రామపంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేడు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం మేరెడ్డిపల్లికి రూ. 1.14 కోట్ల వ్యయంతో నూతనంగా వేసిన బీటీ రోడ్డును మంత్రి పరిశీలించారు. ఆమె వెంట ఎంపిడిఒ నరేంద్రకుమార్, ఎపిఒ వరప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణచౌదరి, పచ్చ అశోక్, వేణు రాయల్, నరసింహులు, నరేష్, రఘునాథ్‌రెడ్డి, హరి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రాజారెడ్డి ఉన్నారు.

ఓబుళదేవరచెరువు : గో సంరక్షణ కేంద్రాలతో పశువులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. మండలంలోని కొండకమర్ల, డబురువారిపల్లి, అహ్మదాబాద్‌క్రాస్ పంచాయతీ ల్లో ఏర్పాటు చేసిన మినీ గోకులాలను ఆదివారం ఎమ్మెల్యే సింధూర మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు 300 మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. వైసిపి పాలనలో రైతులకు చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. జగన్ హయాంలో గ్రామాలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంతేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పి.ఓబుల్‌రెడ్డి, బోయపల్లి శివారెడ్డి, నిజాం, అల్లాపల్లి ఓబుల్‌రెడ్డి, మాబాషా, అంజనప్ప, మండోజి ఆరిఫ్ ఖాన్, షాను, డాక్టర్ జాకీర్ అహ్మద్, షఫీ, రామానాయుడు, పీట్ల మనోహర్ పాల్గొన్నారు.

పెనుకొండ : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రాంపురం పంచాయతీ కొండంపల్లిలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడి పరిశ్రమ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం గోకులం షెడ్లు ఏర్పాటు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాసులు, వైస్ సర్పంచి హనుమంతునాయక్, ఎపిఒ జయమ్మ, టిడిపి మండల కన్వీనర్ డి.సిద్దయ్య, నాయకులు రాజునాయక్, రామకృష్ణారెడ్డి, నీరుగంటి చంద్ర, అంజి, రాము, చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కదిరేపల్లి గ్రామపంచాయతీ కోడిగానిపల్లి గ్రామంలో రైతు చంద్రశేఖర్‌రెడ్డికి మంజూరైన గోకులం షెడ్డును మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీకాంత్‌గౌడ్, ఉపాధి సిబ్బంది శ్రీనాథ్, సుకూర్, తిప్పేస్వామి, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, తాలూకా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా జీవనానికి ఆటంకం కల్పిస్తే ఉపేక్షించం : ఎస్పీ



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజా జీవనం, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ వి.రత్న హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లు, పాత కేసుల్లో ఉన్న నిందితులకు ఆదివారం ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. మీ కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, గొడవ లు, అల్లర్లు, సృష్టించినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకొని ప్రశాంత జీవనం గడపాలన్నారు. అనంతరం వన్ టౌన్, టూ టౌన్, రూరల్, అప్ గ్రేడ్ సర్కిల్ పోలీస్ స్టేషన్లను సందర్శించి రికార్డులను తనిఖీ చేసి అధికారుల పనితీరుపై సమీక్షించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. సిబ్బంది పనితీరు బాగా మెరుగుపరుచుకోవాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమ న్నారు. కర్నాటక సరిహద్దులోని తూముకుంట చెక్‌పోస్ట్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచిం చారు. ఆమె వెంట ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్ధన, కరీం, ఎస్‌బి ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. ఆమె ప్రజలతో పాటు పోలీస్ కుటుంబాలు, పాత్రికేయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హర్ష, తదితరులు

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-తాడిమర్రి

తాడిమర్రిలో ఆదివారం సయ్యద్ మహమ్మద్ షా ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు ఆదివారం గంధం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు ముంటిమడుగు హర్ష దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముంటిమడుగు వినోద్‌కుమార్, పక్కీరారెడ్డి, మురళీగౌడ్, భాస్కర్‌గౌడ్, శంకర్‌నాయుడు, గణేష్, నగేష్ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, తదితర జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ కృష్ణమూర్తి హెచ్చరించారు. మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, గసిగవారిపల్లి, పాముదుర్తి, తదితర గ్రామాల్లో ఆదివారం ఎస్‌ఐ, పోలీసులు డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు.

టిడిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని పాముదుర్తి గ్రామంలో మృతి చెందిన టిడిపి కార్యకర్త లక్ష్మీనారాయణ కుటుం బాన్ని ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పరామర్శించారు. వారు లక్ష్మీనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లక్ష్మీనారాయణ లేని లోటు ఆ కుటుంబానికి, టిడిపికి తీరనిలోటు అన్నారు. వారి వెంట మండల కన్వీనర్ మల్లిరెడ్డి, సర్పంచి జ్యోతికృష్ణమూర్తి, ప్రసాద్, గంగాధర్ పాల్గొన్నారు.

రేపు సీసీ రోడ్లకు భూమిపూజ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఎర్రాయిపల్లి గ్రామంలో ఈ నెల 14వ తేదీ మంత్రి సత్యకుమార్‌యాదవ్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సీసీ రోడ్ల ఏర్పాటుకు భూమిపూజ చేస్తారని నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని శిల్పారామంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏవో రమేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం భోగి సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సహకారంతో మహిళలకు ముగ్గురు పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన మహిళలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేత బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. మంగళవారం బిల్డర్లు ప్రదీప్, రమేష్ సహకారంతో జబర్దస్త్ కళాకారులు గల్లీ బాయ్ రియాజ్, రాజమౌళి, శాంతి స్వరూప్‌లతో సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ కామెడీ కార్యక్రమం ఉంటుంద న్నారు. అలాగే పులి వెందుల రాజా డాన్స్ అకాడమీ సభ్యుల కూచిపూడి, భరతనాట్యం, డిజె నృత్యాలు నిర్వహిస్తామన్నారు. బుధవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ వినాయక డాన్స్ అకాడమీ ధర్మవరం వారిచే నృత్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాలోల ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మైనేని వర్ధంతి



మైనేని వెంకటరత్నం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

యుటిఎఫ్ ఆవిర్భావ నిర్మాతలలో ప్రముఖుడు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడిగా పని చేసిన మైనేని వెంకటరత్నం వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఎంఎస్ఆర్ రెసిడెన్సీలో యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మైనేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మైనేని వెంకటరత్నం నేటితరం నాయకులకు ఆదర్శ ప్రాయుడన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, కోశాధికారి డి.శ్రీనివా సులు, జిల్లా కార్యదర్శులు సుబ్బారెడ్డి, సి.లక్ష్మినారాయణ, నరేష్‌కుమార్, డి.అనిల్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాస్, సిపిఎస్ కమిటీ కన్వీనర్ సునిల్‌కుమార్, నారాయణస్వామి పాల్గొన్నారు.



వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెసిపిఆర్

సీనియర్ టిడిపి నాయకులు జెఈ వెంకటస్వామి మృతి



వెంకటస్వామి(ఫైల్)

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జేసీ వెంకటస్వామి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటస్వామి గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మెన్ గా బాధ్యతలు నిర్వహించారు. దీనికి తోడు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా వెంకటస్వామి భాగస్వాములయ్యారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో నేతగా గుర్తింపు పొంది ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం పట్టణ నడిబొడ్డున నిర్మిస్తున్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ కోసం ఎంతో శ్రమించారు. కాగా జెఈ వెంకటస్వామి మృతి విషయం తెలిసిన వెంటనే హిందూపురం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు వెంకటస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి తదితర ఆయా పార్టీల నేతలు వెంకటస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మృతుని కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు.

ఆర్‌ఒబి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కుటాగుళ్ల వద్ద ఆర్‌ఒబికి సంబంధించి అప్రూవల్ లేఅవుట్ బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి పనులు ప్రారంభించాలని బాధితుల సంఘం నాయకులు రామ్మోహన్, మహేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ. లక్షలు ఖర్చు పెట్టి అప్రూవల్ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు కొన్నామని, వాటిని కోల్పోయిన బాధితులకు మార్కెట్ విలువ ప్రకారం కాకుండా అతి తక్కువ ధరతో చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌డిఒగా పని చేసిన వంశీకృష్ణ బాధితులతో సమావేశం ఏర్పాటు చేసి సెంటుకి రూ. 3.36 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్‌ఒబి బాధితులు దాదాపు 150 మంది ఉన్నారన్నారు. లే అవుట్‌లు, నాన్ లేఅవుట్లకు ఒకే విధమైన నష్టపరిహారం చెల్లించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఎంపి బికె.పార్థసారథి, కలెక్టర్ స్పందించి ఆర్‌ఒబి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1976-78 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ఆదివారం తల్లం నారాయణమూర్తి ఆధ్వర్యంలో పట్టణంలోని దాసరి వెంకటేశులు(చిట్టి) గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఆత్మీయ సమావేశమయ్యారు. ఆనాటి ఆంగ్ల అధ్యాపకులు ఎం.సాయినాథ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్వేగానికి లోనయ్యారు. తమ విద్యార్థులు చేసిన సత్కారానికి గురువు సాయినాథ దంపతులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ సన్మానం జీవితంలో మరుపు రానిదన్నారు. కార్యక్రమంలో దాసరి చిట్టి, నారాయణమూర్తి, 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కదిరి తాలూకా యూనిట్ గౌరవాధ్యక్షులు ఆత్మారెడ్డి, అధ్యక్షులు ఫకృద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ డా. హుసేన్, కదిరి తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయసం హరి ప్రసాద్, సెక్రటరీ నాగమణి, ట్రెజరర్ చిన్నయ్యశెట్టి, సుధాకర్, దేవ్లానాయక్, ఉపేంద్రరెడ్డి, బాబావలి, రామాంజనేయులు, రామ్‌ప్రసాద్‌రెడ్డి, హేమలత, ప్రసన్నకుమారి, రామాంజులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు శివప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

వైసిపి జిల్లా నూతన ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ శివప్రసాద్‌ను ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి సమిష్టిగా పని చేద్దామన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదామన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ విభాగం అధ్యక్షులు రంగేగౌడ్, రాష్ట్ర బిసి విభాగం సభ్యులు సత్యనారాయణ, హరీష్, రాజుగౌడు, పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని గుమ్మయ్యగారిపల్లిలో ఆదివారం జరగాల్సిన ఓ బాల్య వివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఓబుళదేవరచెరువు మండలంలోని సున్నంపల్లికి చెందిన యువకుడు (26)తో కడప జిల్లా వేంపల్లె మండలంలోని టి.వెలమవారిపల్లికి చెందిన బాలిక(16)కు గుమ్మయ్యగారి పల్లిలోని ఓ కళ్యాణ మండపంలో వివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఐసిడిఎస్ సూపర్ వైజర్ కొండసాని రజిత, అంగన్వాడీ వర్కర్ విజయమ్మ అక్కడికి చేరుకుని ఇరు కుటుంబాల పెద్దలు, బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఈ వివాహాన్ని తాత్కాలికంగా ఆపి వేయాలని సూచించారు. బాలికకు 18 ఏళ్లు పూర్తయ్యే వరకు పెళ్లి చేయమని ఇరు వర్గాల వారితో సూపర్ వైజర్ రజిత స్టేట్‌మెంట్ తీసుకున్నారు. రెండు కుటుంబాల వారిపై నిఘా ఉంటుందని, బాలికకు 18 ఏళ్ల లోపు పెళ్లి చేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు. అందుకు రెండు వర్గాల వారు అంగీకరించారు. బాల్య వివాహాన్ని ఆపిన ఐసిడిఎస్ అధికారులను స్థానికులు అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని చక్రాలు కొమ్ములు సమీపంలో వడ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను మదనపల్లి వైపు నుంచి వచ్చిన ఐచర్ ఢీ కొంది. ఈ సంఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న నల్లజోడువాళ్లపల్లికి చెందిన రామచంద్ర(60) అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాయనపల్లికి చెందిన నర్సింహులు, ఉబ్బిచెర్లకు చెందిన రవి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఐచర్ అధిక వేగంతో కదిరి వైపు వెళ్తుండగా ఎస్‌ఐ మక్బూల్‌బాషా కదిరేపల్లి గేటు దగ్గర రైల్వే గేట్లు వేసి ఐచర్ వాహనాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని దేవిరెడ్డిపల్లి సమీపంలో కొక్కంటి క్రాస్‌కు చెందిన రేవంత్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ దేవిరెడ్డిపల్లి సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి పడిపో యాడు. ఈ సంఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోళ్లు, వ్యవసాయ పరికరాలు చోరీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక పంగల్ రోడ్డు హైవే సమీపంలోని వ్యవసాయ పొలంలో నాటు కోళ్లు, వ్యవసాయ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఆదివారం రైతు ఆటో పెద్దన్న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల బత్తలపల్లి మండలంలోని డి.జెర్లపల్లి గ్రామస్తులు ముగ్గురు వచ్చి కోళ్లను బేరం ఆడి ధర కుదరక తిరిగి వెళ్లిపోయారని, వారిపైనే అనుమానం ఉన్నట్లు తెలిపారు.

ఆకతాయిల చేష్టలతో డ్రిప్పు పరికరాలు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న డ్రిప్పు పరికరాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని బైరాపురం గ్రామంలో కొందరు ఆకతాయిలు పొలంలో గడ్డికి నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి మంటలు వ్యాపించి డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్ల పైపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. బైరాపురం గ్రామానికి చెందిన సింగిరి బ్రహ్మానందరెడ్డి పొలంలో మూడు ఎకరాల్లో వేసిన డ్రిప్పు పైపులు, 40 పైపులు కాలి బూడిదయ్యాయి. అగ్ని కీలకలు వ్యాపిస్తున్న తరుణంలో రైతులు అప్రమత్తమై మంటలను ఆర్పారు. ఆకతాయిల చేష్టల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

వైసిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి జిల్లా నాయకత్వం ఇటీవల మండలంలోని సిద్ధగిరి గ్రామానికి చెందిన ఆనంద రంగారెడ్డిని పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా, చందకచర్ల గ్రామానికి చెందిన రామిరెడ్డిని మండల కన్వీనర్‌గా నియమించింది. దీంతో ఆదివారం ఆ పార్టీ నాయకులు వారిని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారిని సన్మానించిన వారిలో పంచాయతీ అధ్యక్షులు నారాయణస్వామి, కెపి.దివాకర్, నరసింహప్ప, మల్లేశప్ప, ఎంపిటిసి గోపాల్‌నాయక్, నాగరాజు, హరిప్రసాద్, శేషాద్రి, మహర్షి రవి, శ్రీనివాసులు, గిరీష్, ధనుంజయ్, బాలు, విజయ్ కుమార్, తిమ్మరాయుడు, కాలేనాయక్, తిప్పన్న, శశిధర్, సుల్తాన్ ఉన్నారు.

ఆర్‌ఇఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొద్దం

రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్‌ఇఎఫ్) నూతన స్టేట్ క్యాలెండర్‌ను ఆదివారం పెనుకొండ పట్టణంలోని తన నివాసంలో మంత్రి సవిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి.నాగభూషణ్, రాష్ట్ర నాయకులు వి.రామకృష్ణ, కోటి, మల్లేష్, జిల్లా అధ్యక్షులు దాసరి ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.హరికృష్ణ పాల్గొన్నారు.



ఆర్‌ఇఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, తదితరులు

స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగిద్దాం

జయంతి సభలో వక్తలు



కొత్తచెరువు లో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగిద్దామని ప్రముఖులు పిలుపునిచ్చారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని బిసి మహాజన సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కెఆర్.హరిప్రసాద్, మునికుమార్ మాట్లాడుతూ భారతదేశం నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన మహనీయుల్లో వివేకానంద ఒకరు అన్నారు. కుల, మత, లింగ వివక్ష లేకుండా అందరూ సమానత్వమే అన్నారన్నారు. కార్యక్రమంలో చారుపల్లి శివకుమార్, ప్రసాద్, బహుజన నాయకుడు వేణుగోపాల్, వీరవిగ్నేష్, నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : దేశ యువతకు స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడని ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం ఎంపిడిఒ ఓ ప్రకటనలో వివేకానంద సందేశాన్ని తెలిపారు. వివేకానంద తన ప్రసంగాలతో మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం ప్రముఖులను అబ్బురపరిచారన్నారు. తన ఉపన్యాసం ద్వారా యువతకి మంచి సందేశాలు ఇచ్చారని, వాటిని మనం ఎప్పటికీ మరువకూడదన్నారు.

కొత్తచెరువు : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నెహ్రూ విగ్రహం వద్ద స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ నేటి యువతకు వివేకానంద మార్గదర్శకుడన్నారు. ఇలాంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు అమరాచంద్ర, లోచర్ల పెద్దన్న, ఓబులేసు, పాల్గొన్నారు.

పెనుకొండ : దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అని టిడిపి నాయకులు కొనియడారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, బాబుల్‌రెడ్డి, రమణమ్మ, చంద్రకాంతమ్మ, రామాంజనేయులు పాల్గొన్నారు.

తాడిమర్రి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1991-92 పదో తరగతి బ్యాచ్ శ్రీస్ఫూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్ఫూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గెట్ టు గెథర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బాలం నారాయణరెడ్డి, కునుకుంట్ల శివారెడ్డి, గుండా నాగరాజు, పోలంపల్లి అశ్వత్, పత్రపల్లి గంగాధరరావు, ప్రతాప్, ఏఈ పుల్లారెడ్డి, బిసాని లక్ష్మీనారాయణ, పెద్దకోట్ల చంద్రశేఖర్, మోదగులకుంట నర్సింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ మంజునాథ్ వివేకానందుని విగ్రహానికి పూలమాలతో అలంకరించి వివేకానదిని గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లో సప్తగిరి విద్యా సంస్థల ఏ.ఓ. బి గంగిరెడ్డి, జూనియర్ ఎన్ఎస్ఎస్ పి ఓ లు జి ప్రకాష్, టి నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.